షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448


# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 243 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 19 సెప్టెంబర్ 2024 పేజీలు 8 : వెల 3/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 240 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 31 july 2024 PAGES : 8 PRICE : 3/-




## జమిలీ ఎన్నికల దిశగా
# అడుగులు

- 'వన్ నేషన్... వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం!
- కేంద్ర కేబినెట్ ముందుకు రామ్‌నాథ్ కోవింగ్ కమిటీ సిఫార్సులు
- కేబినెట్ ఆమోదం తెలిపినట్టు చెబుతున్న కేంద్ర ప్రభుత్వ వర్గాలు
- త్వరలోనే బిల్లు పార్లమెంట్ ముందుకు వెళ్లే అవకాశం
- లోక్‌సభ ఎన్నికలు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి
- ఆ తర్వాత 100 రోజుల్లోగా నగర, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనేది ప్రతిపాదనగా ఉంది

–3లో





## ప్రతి ఒక్కరికి
# ఉపాధి అవకాశం

- కొత్త పాలసీని ప్రకటించిన రేవంత్
- 'చాలామంది విద్యార్థుల్లో డిగ్రీలు ఉన్నా పరిశ్రమలకు తగిన నైపుణ్యం ఉండడం లేదు
- విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రేడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం.
- ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది
- ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు
- అందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నాం
- పార్టీలకతీతంగా అభివృద్ధి ఫలాలు..
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తగ్గం: రేవంత్

హైదరాబాద్

కాంగ్రెస్ సర్కార్ పార్టీలకతీతంగా అభివృద్ధి ఫలాలను అందజేస్తోందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికీ ఉపాధి కల్పించే విధంగా రాష్ట్రంలో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఎంఎస్ఎంఈ పాలసీ - 2024ని బుధవారం విడుదల చేశారు. 'చాలామంది విద్యార్థుల్లో డిగ్రీలు ఉన్నా పరిశ్రమలకు తగిన నైపుణ్యం ఉండడం లేదు. విద్యార్థుల్లో స్కిల్ అప్‌గ్రేడేషన్ చేయడానికి కృషి చేస్తున్నాం. నూతన విధానాలు రూపకల్పన చేయకుండా రాష్ట్రం అభివృద్ధి చెందదు. పరిశ్రమలకు గత ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీలను చెల్లిస్తాం. కొవిడ్ వ్యాక్సిన్ తయారీలో కూడా తెలంగాణ ముందుంది. ఐటీ, ఫార్మా అభివృద్ధికి కాంగ్రెస్ ఎంతో కృషి చేసింది. ప్రతి ఏడాది లక్షల మంది ఇంజినీరింగ్ విద్యార్థులు బయటకు వస్తున్నారు. అందరికీ ఉపాధి కల్పించేలా చర్యలు చేపడుతున్నాం.' అని సీఎం పేర్కొన్నారు.ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పరిచేందుకు ఓటిఇలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రేవంత్ తెలిపారు. 'రాష్ట్ర సంపదను పెంపొందించాలనే ఎంఎస్ఎంఈ పాలసీ-2024ను ఆవిష్కరించాం. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మంత్రి శ్రీధర్ బాబు - మిగతా3లో



## పదిహేను రోజుల్లో
# నేల మట్టం చేయాలి

- బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చిన హైకోర్టు
- నల్గొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చేయాలని హైకోర్టు ఆదేశం
- కూల్చివేతలకు 15 రోజుల గడువు విధింపు
- బీఆర్ఎస్ కు రూ. 1 లక్ష జరిమానా

హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీకి తెలంగాణ హైకోర్టు పెద్ద షాకిచ్చింది. నల్గొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చేయాలని ఆదేశించింది. కూల్చివేతలకు 15 రోజుల గడువు కూడా విధించింది. అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ ఆఫీస్‌ను కూల్చేయాలని తెలంగాణ హైకోర్టు అధికారులను ఆదేశించింది. నల్గొండలోని ఆఫీస్‌ను పదిహేను - మిగతా3లో

## ప్రతి వారం పార్టీ కార్యాలయానికి
# మంత్రులు రావాల్సిందే



- టీపీసీసీ చీఫ్ సరికొత్త నిర్ణయం.. ఇకపై వారానికి రెండు సార్లు
- విధి విధానాలను, మంత్రుల షెడ్యూల్‌ను రూపొందించాలని గాంధీ భవన్ సిబ్బందికి టీపీసీసీ చీఫ్ ఆదేశాలు
- ప్రతి బుధ, శుక్రవారాలలో ఒక్క మంత్రి.. గాంధీ భవన్‌కు రావాలని మహేష్ సూచన

హైదరాబాద్

రాష్ట్ర మంత్రులకు సంబంధించి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సరికొత్త నిర్ణయం తీసుకున్నారు. ఇకపై వారానికి రెండు రోజులు మంత్రులు గాంధీభవన్‌కు వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. ఆ మేరకు విధి విధానాలను, మంత్రుల షెడ్యూల్‌ను రూపొందించాలని గాంధీ భవన్ సిబ్బందికి టీపీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్ కుమార్ గౌడ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన - మిగతా3లో



# జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు

- కేంద్రం ప్రతిపాదనను ఎవరు అంగీకరించరు
- దేశంలోని సమస్యలను పక్కదారి పట్టించేందుకే జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తున్నారు
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నిక వస్తే అప్పుడు నిర్వహించాల్సిందే
- జమిలి ఎన్నికను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది"
- జమిలి ఎన్నికలపై కాంగ్రెస్ ఘాటు రియాక్షన్


## అంకెలు ఎప్పుడూ
# అబద్ధం చెప్పవు

- కేసీఆర్ సాధించిన విజయాలు ఎప్పటికీ చెదిరిపోవు
- అన్ని రంగాల్లోనూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచింది
- జాతీయ సగటు కంటే అధిక తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్వయంగా కేంద్రమే పేర్కొంది
- అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలపారు అనడానికి ఇది నిరూపిస్తుంది



హైదరాబాద్


కేసీఆర్ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిన సంగతి తెలిసిందే. అన్ని రంగాల్లోనూ దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచింది. జాతీయ సగటు కంటే అధిక తలసరి ఆదాయాన్ని నమోదు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని స్వయంగా కేంద్రమే పేర్కొంది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో - మిగతా3లో



## కరోనాలో
# కొత్త వేరియంట్

- 27 దేశాలకు వ్యాప్తి
- కొత్తగా ఎక్స్ఈసీ వేరియంట్
- జర్మనీలో గుర్తింపు
- యూరప్ దేశాల్లో వ్యాప్తి

# సరస్వతి శిశు మందిర్ పాఠశాలల కు పైసలు ఎందుకు ఇవ్వరు





**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబరు 17:** ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సా లకు నిధులు ఎందుకు ఇస్తున్నారని భారతీయ సంస్కృతికి నిలయమైన శిశు మందిర్ పాఠశాలలకు పైసలు ఎందుకు ఇవ్వరని నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ పాఠశాలలను ఎందుకు పట్టించుకోవడం లేదని దేశ చరిత్రను వక్రీకరిస్తూ విదేశీ భావజాలాన్ని కాంగ్రెస్ కమ్యూనిస్టులు పెంచి పోషిస్తున్నారని కేంద్ర హెూమ్ శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం జమ్మికుంట లోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయ నూతన హాస్టల్ బ్లాక్ ను కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదానికి బీజం వేస్తున్న మదర్సా లకు రాష్ట్ర ప్రభుత్వం నిధులిస్తుండటం శోచనీయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చీపురు పుల్లతో సైతం ఏకే 47లు తయారు చేసేంతటి శిక్షణనిస్తూ ఉగ్రవాదాన్ని పోషిస్తూ దేశ భద్రతకు ముప్పుగా పరిణమించిన మదర్సాలకు ప్రభుత్వాలు నిధులివ్వడం ఎంత వరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. అదే సమయంలో భారతీయ సనాతన సాంప్రదాయాలను సంస్క్రుతిని పెంపొందిస్తూ విద్యను అభ్యసిస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయాలకు ప్రభుత్వం నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. సరస్వతి శిశుమందిర్ గొప్పతనంతోపాటు శిశు మందిర్ కు కార్పొరేట్ స్కూళ్లకు మధ్య ఉన్న తేడాను వివరించారు.తెలంగాణలో వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని 20 వేలకుపైగా స్కావెంజర్ పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టించుకోవడం లేదని బండి సంజయ్ మండిపడ్డారు. మధ్యాహ్న భోజన బాధ్యత కూడా ప్రధానోపాధ్యాయులపైనే పెట్టారని ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ శాఖకు విద్యా మంత్రి కూడా లేకపోవడం శోచనీయం అని ఆయన విమర్శించారు.నేను శిశు మందిర్ విద్యార్థినని గర్వంగా చెప్పుకోగలుగుతున్నా అని చెప్పారు.ఇక్కడ చదువుకున్న వాళ్లలో ఎంతో మంది డాక్టర్లు ఇంజనీర్లు టీచర్లు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు రాజకీయ నాయకులయ్యారని ఆయన తెలిపారు. విదేశాల్లో సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసుకుని ఎంతో మందికి ఉద్యోగాలు కల్పిస్తూ స్థిరపడ్డ వాళ్లు కూడా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగడి కృష్ణారెడ్డి మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు చందా విశ్వనాథం నాయకులు సంపత్ రావు జీడిమల్లేష్ ఆకుల రాజేందర్ శీలం శ్రీనివాస్ మాజీ జెడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మికుంట పెసర బండ కబ్జా పై కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేత



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబరు 18:** జమ్మికుంట పట్టణంలోని పెసర బండి 22 గుంటల ప్రభుత్వ భూమిని భూ కబ్జా దారుడు ఆక్రమించి ప్రహరీ గోడను నిర్మించారని కాబట్టి వెంటనే ప్రభుత్వ భూమిపై విచారణ జరిపించి కబ్జాదారుని నుండి ప్రభుత్వ భూమిని కాపాడాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు జమ్మికుంట పట్టణానికి చెందిన సీనియర్ సోషల్ వర్కర్ గుర్రపు మహేంద్ర నాథ్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎండి అక్బర్ పాషా లు వినతిపత్రాన్ని అందజేశారు. సందర్భంగా మాట్లాడుతూ పాత మున్సిపాలిటీ పక్కన ఉన్న స్థలం పెసర బండ ప్రభుత్వ భూమి అని 2018 లో అడ్వకేట్ జనరల్ కమిషనర్ మండల సర్వేయర్ నివేదిక ఇచ్చారని వారు తెలిపారు.5 ఆగస్టు 2024న 22 గంటల భూమికి ప్రైవేటు వ్యక్తి ప్రహరి గోడ నిర్మించడం జరిగిందని చెప్పారు. ఇట్టి ప్రహరీ గోడను రాత్రికి రాత్రే నిర్మించారని అన్నారు. అట్టి నిర్మాణం పై ఆగస్టు 7న జమ్మికుంట తహసిల్దారు కు ఫిర్యాదు చేశామన్నారు. మండల సర్వేయర్ డివిజన్ సర్వేయర్ తో సర్వే చేసి కబ్జాదారుడికి అనుకూలంగా ప్రభుత్వ భూమిని పట్టా భూమి గా మార్చి తప్పుడు పత్రాలను అధికారులు సృష్టించి రిపోర్టును వారికి అనుకూలంగా సహకరించారని వారు ఆరోపించారు. మునిసిపాలిటీ అనుమతులు లేకుండానే 22 గంటలకు ప్రహరీ గోడను నిర్మించడం జరిగిందన్నారు అధికారులు ఒక ఎన్నారై వ్యక్తి భూకబ్జా కు పాల్పడినప్పటికీ కూడా వారికి సహకరిస్తూ ప్రభుత్వ భూమిని పట్టా భూమి అని నివేదికను ఇస్తూ వారికి సహకరిస్తున్నారని వారు మండిపడ్డారు. ఇది పట్టా భూమి కాదని ప్రభుత్వ పెసర బండ భూమి అని దీనిని కాపాడాలనే ఆలోచనతో రిలే నిరాహార దీక్ష ఆగస్టు 30న స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ముందు చేపట్టడం జరిగిందన్నారు. ఇటు దీక్షను ఆరు రోజులు కొనసాగించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 4న నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు అని 22 గంటల ప్రభుత్వ పెసర బండ భూమిని కాపాడాలని వారు కోరారు. భూకబ్జా దారుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కర్రతో కొట్టి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తికి మూడు సంవత్సరాలు జైలు శిక్ష

**3000 /-రూపాయల జరిమానా విధించిన రామన్నపేట కోర్టు మెజిస్ట్రేట్ చందన**



**షణ్ముఖ వెలుగు అడ్డ గూడూరు ప్రతినిధి సెప్టెంబర్ 18:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డ గూడూరు మండలం కొండం పేట గ్రామానికి చెందిన ఇటికాల వెంకన్న భార్య ఇటికాల రాధిక వాళ్ల అక్క అయిన పాలడుగు రేణుక ఆమె కొడుకు గణేష్( 12) ఇద్దరు చుట్టపు చూపుగా ఇటికాల వెంకన్న ఇంటికి రాగా సెప్టెంబరు 30 2018 రోజున రాత్రి సుమారు 11:00 గంటల సమయం లో ఇటికాల వెంకన్న బహిర్భుమి కోసం అని పాలడుగు గణేశ్ ను ఊరు బయటకు తీసుకు వచ్చి అకారణంగా మద్యం మత్తులో గణేశ్ ను వెంకన్న కర్ర తో చితకబాది తీవ్ర రక్త గాయాలు అయ్యే విధంగా కొట్టినాడు. ఇట్టి విషయం పై బాలుడి తాత ఎర్ర లింగయ్య అడ్డ గూడూరు పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై పి . శివ నాగప్రసాద్ కేసు నమోదు చేసి ఆధారాలు సేకరించి చార్జ్ షీట్ దాఖలు చేశారు. నేరారోపణలు రుజువు కావడంతో తేదీ 18. 9. 2024 బుధవారం రోజున ఇటికాల వెంకన్న కు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటుగా 3000 రూపాయలు జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ చందన తీర్పునిచ్చారని అడ్డగూడూరు ఎస్సై డి నాగరాజు పత్రిక ప్రకటనలో తెలిపారు .

## జర్నలిస్టు కాలనీలో అన్ని సదుపాయాల కల్పనను కృషిచేస్తా : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్...



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి సెప్టెంబరు 18:** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి జర్నలిస్ట్ కాలనీకి చెందిన జర్నలిస్టులు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిసి కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ఇప్పటికే జర్నలిస్టు కాలనీలో రోడ్లు డ్రైనేజీ వీధి దీపాలు మంచినీటి సరఫరా వంటి వసతులను కల్పించామని రాబోయే రోజుల్లో కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పిల్లల పార్కు చెర్ల ఎల్లమ్మ దేవాలయానికి రోడ్డు వంటి అభివృద్ధి పనులను చేపట్టి జర్నలిస్ట్ కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆస్కాని మారుతి సాగర్ జర్నలిస్టులు లాలయ్య దేవేందర్ కృష్ణారావు మారుతి కుమార్ గోవిందరావు గణేష్ రమేష్ శ్రీనివాసరావు జగదీష్ గుప్తా మల్లికార్జున్ జీతయ్య తదితరులు పాల్గొన్నారు.

## జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో తడి పొడి చెత్త పై అవగాహన

**జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్**




**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబరు 17:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని మహిళా సంఘం సభ్యులకు వార్డు ప్రజలకు తడి, పొడి చెత్తపై మున్సిపల్ కమీషనర్ మహమ్మద్ అయాజ్ వార్డ్ కౌన్సిలర్ రావికంటి రాజు లకు అవగాహన కల్పించారు. సందర్భంగా కమీషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ వార్డులలోని ప్రజలు సంఘం సభ్యులు చెత్తను వేరు చేయాలని తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనానికి అందించాలన్నారు. మున్సిపాలిటీ 17 వార్డు పరిధిలో చెత్త సేకరణ వాహనాలు వార్డులలో నడుస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఇంటి పన్ను వసూళ్ళలో జమ్మికుంట 5వ ర్యాంకు సాధించిందని రానున్న రోజుల్లో చెత్త సేకరణలో కూడా జమ్మికుంట మున్సిపాలిటీ మంచి ర్యాంకు సాధించాలని సంఘం సభ్యులను వార్డు ప్రజలను కోరారు. కూరగాయలు కిరాణ సామాన్లు కునేందుకు వెళ్ళేటప్పుడు ప్లాస్టిక్ కవర్లు కాకుండా జ్యూట్ బ్యాగులను ఉపయోగించాలని అన్నారు. నీరు నిల్వ ఉన్న చోట ఎప్పటికప్పుడు నీరును పారబోయలన్నారు. లేనియెడల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మహేష్ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్ సీఎల్ఆర్పీలు జ్యోతి మంజుల ఆర్పీ లు అబేధభాను మల్లీశ్వరి రజిత లతో పలువురు సంఘ సభ్యులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## కొత్త పల్లి శ్రీ భక్తాంజనేయ స్వామికి వెండి కిరీటం బహుకరణ



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబరు 18:** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లి శ్రీ భక్తాంజనేయ స్వామికి బుధవారం రోజున బిక్షపతి లావణ్య దంపతులు వెండి కిరీటాన్ని బహుకరించారు సంవత్సరం క్రితం తనకు ప్రభుత్వ ఉద్యోగం వస్తే శ్రీ భక్తాంజనేయ స్వామికి వెండి కిరీటం చేయిస్తానని లావణ్య కోరుకోగా ఇటీవలనే లావణ్య కు గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం రావడంతో బుధవారం రోజున 35 వేల రూపాయల విలువైన వెండి కిరీటం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొద్దుల రవీందర్ ఆలయ అర్చకులు శేషం వరప్రసాద్ లకు అందచేయగా శ్రీ భక్తాంజనేయ స్వామికి వెండి కిరీటాన్ని అలంకరించడం జరిగింది. ఈ సందర్భంగా మొక్కులు చెల్లించుకున్న లావణ్య దంపతులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో చుంచు వీరేశం పూసాల సతీష్ రియాన్ష్ తదితరులు పాల్గొన్నారు

## మల్లాపూర్ తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి సెప్టెంబరు 18** :మల్లాపూర్ మండలంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని బుదవారం రోజున జిల్లా కలెక్టర్ బి,సత్య ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డు లు సరిగా నమోదు అవుతున్నాయా లేదా అని పరిశీలించారు. అనంతరం ధరణి సమస్యల గురించి సమర్పించిన దరఖాస్తులను పరిశీలించారు. తహసిల్దార్ కార్యాలయానికి వచ్చే అన్ని ఫిర్యాదు లను సత్వరమే పరిష్కరించాలని అధికారులందరు ఖచ్చితంగా సమయపాలన పాటించాలని లేని యెడల అట్టి అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆఫీస్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు ఆయన వెంట జగిత్యాల ఆర్డీఓ శ్రీనివాస్ ఎమ్మార్వో వీర్ సింగ్ మండల ఉన్నతాధికారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డిని కలిసిన టీపీసీసీ డెలిగేట్ సభ్యులు కల్వకుంట్ల సుజిత్ రావు



**షణ్ముఖ వెలుగు మల్లాపూర్ ప్రతినిధి సెప్టెంబరు 18:** మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన టీ పిసిసి డెలిగేట్ సభ్యులు కల్వకుంట్ల సుజిత్ రావు బుదవారం రోజున హైదరాబాద్ లోని సిఎం నివాసంలో సిఎం రేవంత్ రెడ్డి తో పాటు డిప్యూటీ సిఎం బట్టి విక్రమార్క లను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. గల్ఫ్ సంక్షేమ నిధిని ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని ముఖ్యంగా కోరుట్ల నియోజక వర్గంలో గల్ఫ్ వలసలు ఎక్కువగా ఉన్నాయని వారందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం నియోజక వర్గంలో ఉన్న సమస్యలను వివరించినట్లు చెప్పారు. ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కృషితో సాధ్యమైన మెడికల్ కాలేజ్

... ముదిగొండ శ్రీకాంత్



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి సెప్టెంబరు 18:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషితోనే యాదాద్రి మెడికల్ కాలేజీ ఏర్పాటుకు సాధ్యమైందని ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్ అన్నారు. మెడికల్ కాలేజీ అనుమతుల కోసం శ్రమించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ను బుధవారం శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి యాదాద్రి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలేటి అనిల్ ఓబీసీ పట్టణ విభాగం ప్రెసిడెంట్ పోరల్ల సతీష్ మన్నె సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు లైన్ మెన్ రాజు ఎఎల్ఎం మహేష్ లను సన్మానించిన ఫ్రెండ్స్ యూత్ సభ్యులు



**షణ్ముఖ వెలుగు ఇబ్రహీంపట్నం ప్రతినిధి సెప్టెంబరు 18:** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో బుధవారం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వేములకుర్తి లైన్ మెన్ కొలిపాక రాజు ఇటీవల వినాయక నవరాత్రి ఉత్సవాలలో విద్యుత్తు పరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విధులు నిర్వహించినందుకు గోదూర్ గ్రామంలో పనిచేస్తున్న జెఎల్ఎం ఎస్కిల మహేష్ కు ఎఎల్ఎం గా పదోన్నతి పొందడం అభినందిస్తూ ఇరువురిని శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు అరె సురేందర్ బర్మా నాగేష్ అన్నారపు రాజశేఖర్ రాధారపు నితిన్ కల్లెడ నరేందర్ అన్నారపు రాకేష్ అరె నరేందర్ బోయపల్లి సృజన్ కుమ్మరి పెల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్న వితరణ సత్ర షెడ్డు ప్రారంభోత్సవం



**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి సెప్టెంబరు 18:** బండ లింగా పూర్ గ్రామంలో శ్రీ రామాలయం లో ప్రతి పౌర్ణమికి అన్నదానం జరుగుతుంది ఆ అన్న సత్రానికి దాతలు బెజ్జారపు రాందాస్ రిటైర్డ్ హెడ్మాస్టర్ బెజ్జారపు మురళి సహకారంతో షెడ్డు నిర్మాణం చేసి పౌర్ణమి సందర్భంగా ఆవిష్కరించారు అనంతరం సుమారు 500 మందికి అన్న ప్రసాద కార్యక్రమం ఏర్పాటు చేసిన ముఖ్య అతిథిగా డాక్టర్. బెజ్జారుపు శ్రీనివాస్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో గండి హనుమాన్ దేవాలయ చైర్మన్ ఏనుగు రామానుజం రెండ్ల రాజన్న శివ రవి రాజేష్ గంగ స్వామి గట్టయ్య పెరుమాళ్ల నారాయణ భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## మెట్ పల్లి పోలీస్ సర్కిల్ పరిధిలో ప్రశాంతంగా వినాయక నిమజ్జనం




**షణ్ముఖ వెలుగు మెట్ పల్లి ప్రతినిధి సెప్టెంబరు 18:** మెట్ పల్లి మల్లాపూర్ ఇబ్రహీంపట్నం మండలాల్లోని ఆయా గ్రామాల ప్రజలందరికీ మెట్ పల్లి సీఐ నిరంజన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు గత మూడు రోజులుగా ఆయా మండలాల్లో పట్టణాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా జరుపుకునేందుకు సహకరించిన అన్ని శాఖల అధికారులు సిబ్బందికి ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులకు మెట్ పల్లి సర్కిల్ పోలీస్ శాఖ తరపున సిఐ నిరంజన్ రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు భక్తిశ్రద్ధలతో ప్రజలందరూ ఉత్సాహంగా వేడుకగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సహకరించిన అన్ని మతాల వారికి యువతకు మహిళలకు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు ఆర్గనైజింగ్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు జగిత్యాల జిల్లా ఎస్పీ ఐపీఎస్ అశోక్ కుమార్ మెట్ పల్లి డిఎస్పి ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు ఎలాంటి అల్లర్లు జరగకుండా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా చర్యలు చేపట్టినందుకు మెట్ పల్లి సర్కిల్ పరిధిలోని సీఐ ఎస్సై లను అభినందించారు

# రాహుల్ గాంధీని తీవ్రవాదిగా చిత్రీకరించడం హేయనీయం

**రాహుల్ గాంధీ మీద ఈగ వాలిన చూస్తూ ఊరుకోం**

**బిజెపి నాయకులు గాడ్సే విధానాలను అవలంబిస్తున్నారు**

**టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్**

**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ ప్రతినిధి సెప్టెంబరు 18**
లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పై ఈగ వాలినా ఊరుకోమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ బిజెపి పార్లమెంట్ సభ్యులు రాహుల్ గాంధీ ని తీవ్రవాది గా చిత్రీకరిస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. హుజురాబాద్ లో కూడా రాహుల్ గాంధీ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కేసులు పెట్టాలని నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ సూచించారు. గాంధీ కుటుంబంలో పుట్టిన వ్యక్తి రాహుల్ గాంధీ నెహ్రూ వేసిన బాటలో నేడు దేశం అభివృద్ధిలో ముందుకు పోతుందని అన్నారు. భారత్ జోడో యాత్ర ద్వారా రాహుల్ గాంధీకి దేశ వ్యాప్తంగా మంచి ఆదరణ వచ్చిందని బీజేపీకి అక్కసు ఉందన్నారు. తీవ్రవాదుల చేతుల్లో కుటుంబాన్ని కోల్పోయిన వ్యక్తి రాహుల్ గాంధీ అని అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రధాని ఎందుకు స్పందించడం లేదని గాడ్సే విధానాన్ని మోడీ పాటిస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. రాహుల్ గాంధీ మీద ఈగ వాలిన ఊరుకునేది లేదు. మతాన్ని అడ్డుపెట్టుకొని మోడీ ప్రధాని అయ్యారని అన్నారు. యావత్ భారతదేశం ఇప్పుడు రాహుల్ గాంధీ వైపు చూస్తుందని భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ దేశం లో అధికారంలోకి వస్తుందన్నారు. ఇప్పుడు అధికారంలో ఉన్న బిజెపికి 100 సీట్లు కూడా రావని ఆయన అన్నారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర రవాణా శాఖ బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్న ప్రభాకర్ గౌడ్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు మండల అధ్యక్షుడు కొల్లూరు కిరణ్ పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల పుష్పలత మండల అధ్యక్షురాలు లంక దాసరి లావణ్య తదితరులు పాల్గొన్నారు.



# మచ్చలేని నాయకుడు కూన శ్రీశైలం గౌడ్

**బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై**

**విలేకరుల సమావేశంలో తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన కాంగ్రెస్ నేతలు**

**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి సెప్టెంబరు 18:** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ పై పత్రికా విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గాజులరామారం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డివిజన్ అధ్యక్షులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పైనా నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ పైనా మరో సారి నోటికొచ్చినట్లు మాట్లాడితే గల్లీలో కొట్టుడు ఖాయం.. మేం కాదు ప్రజలే కొడతారు. పోలీసులు కొడితే అమ్మా అయ్యా అని బయటికి వచ్చినోడు కూడా ఎగిరెగిరి పడుతుండు.. 35 ఎకరాల ఫోర్జరి కేసులో జైలుకు వెళ్లి వచ్చినా ఒక కార్పొరేటర్ కి ఇంకా సిగ్గు రాలేదు. ఫోర్జరీ లు చేసి జైలుకు వెళ్లిన నాయకులు, రాజీవ్ గృహకల్ప ఎక్స్టెన్షన్ నిందితులు సైతం కూన శ్రీశైలం గౌడ్ గారిపై మాట్లాడటం సిగ్గుచేటు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు లుచ్చాగాళ్లు.. ఒకడేమో బాలానగర్ లాడ్జిలో దొరికిండు.. ఇంకొకడు ఫైనాన్సు ఆఫీసులో డబ్బులు వాడుకొని సామాన్యుల ముంచి కార్పొరేటర్ అయిండు. ఇప్పుడున్న కార్పొరేటర్లంతా శ్రీశైలం గౌడ్ పెట్టిన రాజకీయ భిక్ష తో బతికి ఇవాళ ఆయననే విమర్శిస్తారా? కుత్బుల్లాపూర్ లో నాళాలు రేషన్ షాపులు ఇండ్ల పట్టాలు ఇందిరమ్మ ఇండ్లు రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కూన శ్రీశైలం గౌడ్ దే.. కాంగ్రెస్ పార్టీ వల్ల బతికిన ఫ్యామిలీ వివేకానంద ది ప్రజలను పీడిస్తూ లుచ్చా పనులు చేస్తున్న కార్పొరేటర్లు.. ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజాసేవకు ముందుండాలని హెచ్చరిస్తున్నాం.





అసెంబ్లీ ఎన్నికల సమయంలో వివేకానంద కు టికెట్ రాకుండా ఎమ్మెల్సీ రాజుకు టికెట్ వస్తుందని చెప్పిన కార్పొరేటర్లు ఎమ్మెల్యే నుండి ప్యాకేజీలు రాగానే బలవంతంగా పనిచేశారు. ఎమ్మెల్యే కు వ్యతిరేకంగా పనిచేసింది మీరు కాదా.. ఇప్పుడు గెలవగానే మా ఎమ్మెల్యే అంటున్నారు. హైడ్రా కు భయపడేది కేవలం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే బిఆర్ఎస్ కార్పొరేటర్లు నాయకులు మాత్రమే. గ్రాడ్యుయేట్ చేస్తేనే మీ ఎమ్మెల్యే విద్యావంతుడా.. ఏమైనా డబల్ పీజీ లు, పీ.హెచ్.డి లు చేసిండా.. అంతకంటే విద్యావంతులు మా కాంగ్రెస్ పార్టీలో చాలా మంది ఉన్నారు. మచ్చలేని నాయకుడు కూన శ్రీశైలం గౌడ్.. ఆయనపై ఇంకోసారి నోటికొచ్చినట్టు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల బలం ఏంటో చూపిస్తాం బిడ్డా.. ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు.

ఈ విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి మాజీ కార్పొరేటర్లు బొడ్డు వెంకటేశ్వరరావు పాలకృష్ణ టిపిసిసి ప్రధాన కార్యదర్శి పున్నారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుంజ శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు డిసిసి ఉపాధ్యక్షులు శ్రవణ్ బండి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఓరుగంటి కృష్ణా గౌడ్ బుచ్చిరెడ్డి కూన రఘు గౌడ్ మోతే శ్రీనివాస్ యాదవ్ జయరాం రషీద్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి బేకు శ్రీనివాస్ పండరి శివ కుమార్ రాధా కృష్ణ రహ్మతుల్లా నాయకులు బాలప్ప చాంద్ పాషా రషీద్ బేగ్ కృష్ణ యాదవ్ లాల్ మహ్మద్ మధు సూధన్ తదితర నాయకులు ఉన్నారు.

## శివ దుర్గ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా గణపతి ఉత్సవాలు



**షణ్ముఖ వెలుగు మేడిపల్లి ప్రతినిధి సెప్టెంబరు 18:** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివ దుర్గ కాలనీ అసోసియేషన్ కమిటీ ఆధ్వర్యంలో గణపతి లడ్డు వేలం పాట పోటా పోటీగా సాగింది. ఈ పోటీలో బొమ్మిశెట్టి రాజు సైదమ్మ దంపతులు అత్యంత ఎక్కువ ధర ఒక లక్షా పదిహేడు వేల రూపాయలకు లడ్డు పాట పాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమం లో స్థానిక కార్పొరేటర్ కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు గణేష్ కమిటీ సభ్యులు మాజీ జనరల్ సెక్రటరీ లు కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డులకు లైన్ క్లియర్

**వరంగల్ :** తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం చాలా కాలంగా ఎదురు చూస్తున్నారు. కుటుంబాల నుంచి వేరు పడిన వారు, పెళ్లిళ్లు చేసుకున్నవారు కొత్త రేషన్ కార్డుల కోసం ఆశగా చూస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు ఆశావాహులకు తెలంగాణ సర్కార్ తీపి కబురు చెప్పింది. అక్టోబర్ నుంచి కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించాలని తాజాగా కేబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన సోమవారం భేటీ అయిన కేబినెట్ సబ్ కమిటీ రేషన్ కార్డుల జారీపై కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులు స్వీకరించాలని నిర్ణయం తీసుకుంది. కొత్తగా 15 లక్షల రేషన్ కార్డులు జారీ చేసే యోచనలో ప్రభుత్వం ఉందని తెలుస్తోంది. అయితే కొత్త రేషన్ కార్డుల అర్హతపై సస్పెన్స్ కొనసాగుతోంది. కార్డుల జారీకి లబ్ధిదారుల ఆదాయ పరిమితి, అర్హతలపై నిబంధనలను పున:సమీక్షిస్తామని చెప్పడంతో ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. బియ్యం అవసరం లేని వారికి స్మార్ట్ హెల్త్ కార్డులు ఇస్తామని చెప్పడంపైనా అనుమానాలున్నాయి. కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50లక్షల్లోపు, పట్టణాల్లో రూ. 2లక్షల్లోపు ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అలాగే 3.5 ఎకరాలలోపు తడి, 7.5 ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్నవారికి మాత్రమే ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే ఏపీ, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్‌లో ఆదాయ పరిమితులు పరిశీలించామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు.

## అంకెలు ఎప్పుడూ అబద్ధం చెప్పవు..

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ రాష్ట్రం అత్యంత అద్భుతంగా అభివృద్ధి చెందిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చెప్పిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ అభివృద్ధి చెందింది అనడానికి ఇంతకన్న సాక్ష్యం ఏం కావాలని అడిగారు. కేవలం తొమ్మిదిన్నరేండ్లలో జాతీయ సగటు కంటే 94 శాతం అధిక తలసరి ఆదాయాన్ని తెలంగాణ రాష్ట్రం నమోదు చేసిందన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలపారు అనడానికి ఇది నిరూపిస్తుందన్నారు. అంకెలు ఎప్పుడూ అబద్దాలు చెప్పవు.. కేసీఆర్ సాధించిన విజయాలు ఎప్పటికీ చెరిపేయలేరు అంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ సూచించారు. ఈ లెక్కలు తానేదో చెప్పడం లేదని కేంద్ర ప్రభుత్వమే స్వయానా వెల్లడించిందని కేటీఆర్ పేర్కొన్నారు.

**దళితులపై ఇంత కర్కశత్వమా..?**

**ఆ బిడ్డలే కాంగ్రెస్ సర్కార్‌కు ఘోరి కడుతరు..!**

దళితులపై చిర్రుబుర్రులాడిన ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని జటప్రోల్ గ్రామంలోని సమీకృత గురుకుల పాఠశాల భవనం కోసం దళితుల భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకుంది. ఈ నేపథ్యంలో అన్యాయంగా మా భూమిని తీసుకోవద్దని న్యాయం చేయండని వచ్చిన దళితులపై ఇంత కర్కశత్వం ప్రదర్శిస్తారా..? అని కేటీఆర్ మండిపడ్డారు. బాధిత దళిత బిడ్డలు మీ భూములు ఇవ్వాలని అడగలేదు.. వారికి గతంలో ఇచ్చిన భూములను తీసుకోకుండా న్యాయం చేయండని మాత్రమే అడిగారు. అంత మాత్రాన నోరు మూయ్ అంటూ సెక్యూరిటీని పెట్టి పంపిస్తారా? ఇందిరమ్మ రాజ్యంలో దళితులకు న్యాయం చేయరా? అణిచివేత ఎక్కువైతే తిరుగుబాటు మొదలవుతుందన్న సహజ సూత్రాన్ని మర్చిపోకండి ఆ దళిత బిడ్డలే మీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘోరి కడుతరు అని జూపల్లి కృష్ణారావును కేటీఆర్ హెచ్చరించారు. మంగళవారం సదరు స్థలాన్ని పరిశీలిచేందుకు మంత్రి జూపల్లి రాగా, సర్వే నంబర్ 508లో ఎనిమిది ఎకరాల భూమిని నాటి జటప్రోల్ సంస్థానాధీశులు రాజా జగన్నాథరావు తమకు ఇచ్చారని దళితులు కిష్టన్న, పెంటయ్య, బాలయ్య, బాలపీరు, సంగమయ్య, శేషమ్మ, శాలయ్య, బాలయ్య తెలిపారు. దీంతో మంత్రి నోరు మూయండని బాధితులను బెదిరించారు. సెక్యూరిటీ వారిని అడ్డుకున్నారు. న్యాయం కోసం వస్తే పట్టించుకోలేదని దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రతి వారం పార్టీ కార్యాలయానికి మంత్రులు రావాల్సిందే

-మొదటిపేజీ తరువాయి

సందర్భంగా మంత్రులు ప్రతి వారంలో రెండుసార్లు గాంధీ భవన్ రావాలని ఆయన సూచించారు. ప్రతి బుధ, శుక్రవారాలలో ఒక్క మంత్రి.. గాంధీ భవన్‌కు రావాలని మహేష్ సూచించారు. వచ్చే శుక్రవారం నుంచి గాంధీ భవన్‌కు మంత్రుల రాక ప్రారంభంకానున్నట్లు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

# జమిలీ ఎన్నికల దిశగా అడుగులు

**న్యూఢిల్లీ :** జమిలీ ఎన్నికలు నిర్వహించాలన్న పట్టుదలతో ఉన్న కేంద్రం మరో ముందడుగు వేసింది. ఈ అంశంపై గతంలో నియమించిన మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ నివేదికను ఆమోదిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నివేదికను గతంలో రాష్ట్రపతికి కోవింద్ సమర్పించారు. ఇందులో వన్ నేషన్, వన్ ఎలక్షన్ విధానాలకు అనుకూలంగా సిఫారసులు చేశారు. తర్వాత పార్లమెంట్ సమావేశాల్లో ఈ అంశంపై బిల్లు పెట్టి ఆమోదింప చేసుకుంటే.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్టు సమాచారం. 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' అంశంపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ తన నివేదికను నేడు కేంద్ర మంత్రివర్గం ముందు ఉంచినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పార్లమెంట్ శీతకాల సమావేశాల్లో ఈ మేరకు బిల్లును కూడా ప్రవేశపెట్టవచ్చని కథనాలు వెలువడుతున్నాయి. ఈ ప్రతిపాదన చట్టంగా మారితే లోక్‌సభ ఎన్నికలు అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరుగుతాయి. ఆ తర్వాత 100 రోజుల్లోగా నగర, పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనేది ప్రతిపాదనగా ఉంది.



**కమిటీ సిఫార్సులు ఇవే...**

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' కమిటీ ఈ ఏడాది మార్చి 15న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు తన నివేదికను అందజేసింది. లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. సిఫారసుల అమలును పరిశీలించేందుకు 'కార్యాచరణ బృందాన్ని' ఏర్పాటు చేయాలని కూడా కమిటీ ప్రతిపాదన చేసింది. ఏకకాల ఎన్నికలు నిర్వహించడం ద్వారా వనరులను ఆదా చేయవచ్చని, తద్వారా అభివృద్ధి, సామాజిక ఐక్యతను పెంపొందించవచ్చని సూచించింది. వన్ నేషన్... వన్ ఎలక్షన్ ప్రక్రియతో ప్రజాస్వామ్య పునాదులను బలోపేతం చేయవచ్చునని, ఈ విధానం దేశ ఆకాంక్షలను సాకారం చేయడంలో తోడ్పడుతుందని అభిప్రాయపడింది. రాష్ట్ర ఎన్నికల అధికారులతో సంప్రదింపులు జరిపి ఎన్నికల సంఘం ఉమ్మడి ఎలక్టోరల్ రూల్, ఓటర్ ఐడీ కార్డులను సిద్ధం చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ప్రస్తుతం లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తుండగా.. మున్సిపాలిటీలు, పంచాయతీల వంటి స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల కమిషన్లు నిర్వహిస్తున్నాయి. రామ్‌నాథ్ కోవింద్ కమిటీ మొత్తం 18 రాజ్యాంగ సవరణలను సిఫారసు చేసింది. వీటిలో చాలా వరకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అవసరం లేదు. అయితే కొన్ని రాజ్యాంగ సవరణ బిల్లులకు రాష్ట్రాల అసెంబ్లీలు కూడా ఆమోదం తెలిపాల్సి ఉంది. వీటిని పార్లమెంటు కూడా ఆమోదించాల్సి ఉంటుంది.

**వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్**

కాగా, వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రతిపాదనను సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తులతో పాటు మొత్తం 32 పార్టీలు, ప్రముఖ న్యాయమూర్తులు సమర్థించారని రామ్‌నాథ్ కోవింద్ కమిటీ పేర్కొంది. అయితే కాంగ్రెస్ పార్టీ సహా 15 పార్టీలు వన్ నేషన్.. వన్ ఎలక్షన్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నాయి.

# జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు

**ఢిల్లీ :** ఒకే దేశం ఒకే ఎన్నిక విధానం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని కాంగ్రెస్ విమర్శించింది. జమిలి ఎన్నికలకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపిన విషయం విదితమే. దీనిపై ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ స్పందించింది. జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావని పేర్కొంది. కేంద్ర ప్రతిపాదనను అంగీకరించడానికి ఎవరూ సిద్ధపడరని అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. " జమిలి ఎన్నికలు దేశంలో సాధ్యం కావు. కేంద్రం ప్రతిపాదనను ఎవరు అంగీకరించరు. దేశంలోని సమస్యలను పక్కదారి పట్టించేందుకే జమిలి ఎన్నికల ప్రస్తావన తెస్తున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎప్పుడు ఎన్నిక వస్తే అప్పుడు నిర్వహించాల్సిందే. జమిలి ఎన్నిక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడవదు. జమిలి ఎన్నికను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది" అని ఖర్గే స్పష్టం చేశారు. అయితే.. ఆ పార్టీ విమర్శలపై బీజేపీ మండిపడుతోంది.



**త్వరలో పార్లమెంటులో బిల్లు..**

కేంద్ర ప్రభుత్వం జమిలీ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదికను కేబినెట్ బుధవారం మధ్యాహ్నం ఆమోదించింది. రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లు ప్రవేశపెట్టనుంది.

**8 మంది సభ్యులతో కమిటీ..**

కేంద్ర సర్కార్ వన్ నేషన్ – వన్ ఎలక్షన్ ప్రతిపాదన కోసం రామ్‌నాథ్ కోవింద్ సహా 8 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. ఇందులో లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే అవకాశాలపై కమిటీ సభ్యులతో రామ్‌నాథ్ కోవింద్ చర్చించారు. ఎన్నికలకు సంబంధించి అన్ని పార్టీల అభిప్రాయాలను, రాష్ట్రాల సవాళ్లను కమిటీ పరిశీలించింది. సుదీర్ఘ చర్చోపచర్చల అనంతరం రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది.

# మరోసారి అమెరికాకు మోడీ ప్రధానిని కలుస్తానంటున్న బైడన్

**న్యూఢిల్లీ :** అగ్రరాజ్యం అమెరికాలో అధ్యక్ష పదవి కోసం ఓ రేంజ్ లో పోటీ జరుగుతోంది. మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ .. కమలా దేవి హారిస్ ల మధ్య మాటల యుద్ధం కూడా ఓ రేంజ్ లో సాగుతోంది. తాజాగా డోనాల్డ్ ట్రంప్ మన దేశం ప్రధాని నరేంద్ర మోడీని అద్భుతమైన వ్యక్తి అంటూ ప్రసంశల వర్షం కురిపించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిచిగాన్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తూ.. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తానని చెప్పారు. అయితే ర్యాలీలో భారత్ వాణిజ్య విధానాన్ని ట్రంప్ విమర్శించారు.. అదే సమయంలో ప్రధాని మోడీని అద్భుతమైన వ్యక్తి అంటూ కొనియాడారు. వచ్చే వారం మోడీ తనను కలవడానికి వస్తున్నారని ట్రంప్ అన్నారు. వాస్తవానికి ట్రంప్ ఆ దేశ అధ్యక్షుడు కానప్పటికీ.. విదేశీ దేశాధినేతలను కలుస్తూనే ఉన్నారు. జూలైలో ఫ్లోరిడాలో హంగేరియన్ జాతీయవాద ప్రధాన మంత్రి విక్టర్ ఓర్బన్‌ను కూడా కలిశారు. ఈ వారంలో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటించనున్నారు.క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని మోడీ డెలావేర్‌లోని విల్మింగ్టన్‌కు వెళ్తున్నారు. ఇది అధ్యక్షుడు జో బిడెన్ స్వస్థలం. క్వాడ్ సమావేశం కూడా ఇక్కడే జరగేటట్లు ప్రతిపాదించబడింది. ఈ సమావేశానికి ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, జపాన్ ప్రధాని కిషిడా ఫుమియో కూడా హాజరుకానున్నారు. ఈ క్వాడ్‌లో భారతదేశం, జపాన్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాలు సభ్యులు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా జోక్యాన్ని ఎదుర్కోవడానికి ఈ సంస్థ ఏర్పడింది. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్ ఈ క్వాడ్ సమితీ రూపశిల్పి. అధ్యక్షుడిగా ఇదే బిడెన్ చివరి శిఖరాగ్ర సమావేశం.ప్రధాని మోడీ సెప్టెంబర్ 21 నుంచి 23 వరకు మూడు రోజుల పాటు అమెరికాలో పర్యటించనున్నారు. ముందుగా డెలావేర్‌లోని విల్మింగ్టన్‌కు చేరుకుని అక్కడ క్వాడ్ సమ్మిట్‌లో పాల్గొంటారు. దీని తరువాత.. ప్రవాస భారతీయుల సమాజ సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొని అక్కడ ప్రసంగించనున్నారు. అనంతరం న్యూయార్క్‌లో జరిగే ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 22న ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఈ డయాస్పోరా ఈవెంట్ న్యూయార్క్ శివారులోని యూనియన్‌డేల్‌లో జరగనుంది.. ప్రధాని మోడీ పాల్గొనున్న ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రవాస భారతీయులు 25,000 మందికి పైగా టిక్కెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్, బయోటెక్నాలజీ వంటి అధునాతన రంగాలలో భారతదేశం.. జూ మధ్య సహకారాన్ని పెంపొందించడానికి ప్రముఖ జూ కంపెనీల అఖిలతో కూడా మోడీ సమావేశం కానున్నారు. 23వ తేదీన యూఎన్ సమ్మిట్ ఫర్ ది ఫ్యూచర్ కార్యక్రమంలో మోడీ పాల్గొనున్నారు.



# ఈ నెల 21న ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిషి ప్రమాణం!


ఢిల్లీ ముఖ్యమంత్రిగా నియామకమయైన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణస్వీకారంపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమాచారం ఇచ్చారు. అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం సీఎం పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అతిషి కొత్తగా సీఎంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అయితే, ప్రమాణస్వీకారం తేదీని మాత్రం ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించలేదు. మరో వైపు కొత్త ప్రభుత్వంలో ఎవరికి కేబినెట్‌లో చోటు దక్కుతుందనే చర్చ జోరుగా సాగుతున్నది. కేబినెట్‌లో పాత మంత్రులతో పాటు మరో కొత్త ముఖాలకు సైతం ఛాన్స్ దక్కే అవకాశం ఉందని భావిస్తున్నారు. కేబినెట్‌లో ఖాళీగా ఉన్న పదవులపై ప్రాంతీయ, కుల సమీకరణాలు సమతూకంపై పార్టీ కసరత్తు చేస్తున్నది.

షెడ్యూల్డ్ కులానికి చెందిన ఒకరికి మరొకరికి అవకాశం దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత మంత్రివర్గాన్ని మార్చేందుకు సీఎం సానుకూలంగా లేరని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రస్తుత మంత్రులకు మంత్రివర్గంలో చోటు దక్కవచ్చని భావిస్తున్నారు. రెండుబెర్తుల కేబినెట్ బెర్తుల కోసం పలువురు ఎమ్మెల్యేలు రేసులో ఉన్నారు. సోమనాథ్ భారతి, దుర్గేష్ పాఠక్, సంజీవ్ ఝా, దిలీప్ పాండే, మహేంద్ర గోయల్ జనరల్ కేటగిరిలో పోటీలో ఉన్నారు. ఎస్టీ కోటా నుంచి కులదీప్ కుమార్, విశేశ్ రవి, గిరీశ్ సోనీ బరిలో ఉన్నారు. గురువారం నాటికి మంత్రివర్గంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. రాష్ట్రపతి నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో శుక్రవారం నాటికి కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సారి లెఫ్టినెంట్ గవర్నర్ సెక్రటేరియట్‌లోనే ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేస్తుందని భావిస్తున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అతిషి నేతృత్వంలో ఢిల్లీ ప్రభుత్వ తొలి మంత్రివర్గంలో ఢిల్లీ ముఖ్యమంత్రి మహిళా సమ్మాన్ యోజన ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. అక్టోబర్ తొలివారంలో ప్రభుత్వం తొలి కేబినెట్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తున్నది. భేటీలో పలు అంశాలపై చర్చించనున్నారు. ప్రముఖంగా మహిళా సమ్మాన్ యోజనపై చర్చించనున్నారు. పథకం కోసం ఢిల్లీ సర్కారు బడ్జెట్‌లో రూ. 2వేలకోట్లు కేటాయించింది. ఈ పథకంలో ఢిల్లీలో 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1000 ఇవ్వాలని నిర్ణయించారు. ఉద్యోగం చేస్తున్నా.. ఇతర ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్న వారికి పథకం వర్తించదు. అలాగే, ఢిల్లీ జల్‌బోర్డు బిల్లు మాఫీ సహా ఇతర అంశాలపై చర్చించనున్నారు. ఆప్ పదేళ్ల పాలన తర్వాత సీఎంకు సైతం శాఖలు ఉండనున్నాయి. విద్య, పబ్లిక్ వర్క్స్‌తో పాటు పలు కీలకమైన శాఖలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇంతకు సీఎంగా ఉన్న కేజ్రీవాల్ తన వద్ద ఏ ఒక్కశాఖను ఉంచుకోలేదు. కొంతకాలం జలమండలి బాధ్యతలు చూసినా.. ఆ తర్వాత మరొకరికి అప్పగించారు.



## కరోనాలో కొత్త వేరియంట్

యావత్ ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి ఇప్పటికీ ఉనికిని చాటుకుంటూనే ఉంది. కోవిడ్–19 వైరస్ ఆ తర్వాత అనేక విధాలుగా రూపాంతరం చెంది, వేరియంట్లు, సబ్ వేరియంట్లుగా వ్యాపిస్తోంది. తాజాగా, కరోనాలో మరో కొత్త వేరియంట్ కలకలం సృష్టిస్తోంది. ఇది 27 దేశాలకు పాకడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ కరోనా వేరియంట్ ను ఎక్స్ఈసీగా పిలుస్తున్నారు. దీన్ని మొట్టమొదట జర్మనీలో గుర్తించారు. ఇది యూరప్ దేశాల్లో విజృంభిస్తోందని... జర్మనీతో పాటు, బ్రిటన్, నెదర్లాండ్స్, డెన్మార్క్ దేశాల్లో ఈ కొత్త వేరియంట్ పాజిటివ్ కేసులు అత్యధికంగా నమోదవుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, కరోనా వైరస్ లోని ఇతర రకాలతో పోల్చితే ఎక్స్ఈసీ వేరియంట్ వ్యాప్తి చెందే వేగం తక్కువేనని నిపుణులు అంటున్నారు. చలికాలంలో దీని ప్రభావం అధికంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇది ఒమిక్రాన్ వేరియంట్ పరంపరలోనిదే కాబట్టి, వ్యాక్సిన్ తో నివారించవచ్చని తెలుస్తోంది.



## జమ్మూకశ్మీర్‌లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు...

భారత్ లో అత్యంత సమస్యాత్మక ప్రాంతం జమ్మూకశ్మీర్ లో పదేళ్ల తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. కశ్మీర్ లోయలో ఇవాళ తొలి విడత పోలింగ్ జరుగుతోంది. పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్టు అధికారులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 41.17 శాతం పోలింగ్ నమోదైంది. జమ్మూకశ్మీర్ అసెంబ్లీలో మొత్తం 90 స్థానాలు ఉండగా... తొలి విడతలో 24 స్థానాలకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. 24 స్థానాల్లో 219 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ జరగనుంది. ఉగ్రవాద దాడుల నేపథ్యంలో, జమ్మూకశ్మీర్ వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. తనిఖీలు ముమ్మరం చేశారు.


## కేజ్రీవాల్ అధికారిక నివాసాన్ని ఖాళీ చేయడంపై ఆప్ కీలక ప్రకటన

**నిన్న రాజీనామా లేఖను సమర్పించిన కేజ్రీవాల్**

**సీఎం అధికారిక నివాసాన్ని, సెక్యూరిటీని వదులుకోనున్న కేజ్రీ**

**ఆతిశీ సీఎంగా ఏర్పడనున్న కొత్త ప్రభుత్వం**

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కేజ్రీవాల్ తన అధికార నివాసాన్ని ఖాళీ చేస్తున్నారు. కేజ్రీవాల్ వారం రోజుల్లో అధికార నివాసాన్ని ఖాళీ చేస్తున్నట్టు ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ తెలిపారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ కు నిన్న రాజీనామా లేఖను సమర్పించిన తర్వాత కేజ్రీవాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా తనకు లభిస్తున్న అన్ని సదుపాయాలను తాను వదులుకుంటున్నానని చెప్పారని ఆయన వెల్లడించారు. సీఎం హోదాలో తనకున్న సెక్యూరిటీని కూడా వదులుకుంటానని, ఒక సాధారణ పౌరుల్లో ఒకరిగా జీవిస్తానని చెప్పారని అన్నారు. ఆయనపై ఇప్పటికే భౌతికదాడులు జరిగాయని... తన నిర్ణయాన్ని మార్చుకోవాలని కేజ్రీవాల్ ను తాము కోరామని... అయితే తమ విన్నపాన్ని ఆయన అంగీకరించలేదని సంజయ్ సింగ్ తెలిపారు. "ఆరు నెలలు జైల్లో ఉన్నా. జైల్లో ఉన్నప్పుడు నన్ను దేవుడు కాపాడాడు. ఇప్పుడు కూడా దేవుడే కాపాడతాడు" అని తమతో కేజ్రీవాల్ చెప్పారని అన్నారు. అయితే, కేజ్రీవాల్ ఎక్కడుంటారనేది ఇంకా డిసైడ్ చేయలేదని చెప్పారు. మరోవైపు ఆతిశీ నేతృత్వంలో ఆప్ కొత్త ప్రభుత్వం ఏర్పడనుంది.



## చోటా నేతలను రాహుల్ గాంధీపై ఉసిగొల్పుతున్నారు

**కాషాయ పార్టీపై హిమాచల్ సీఎం ఫైర్**

రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి, బీజేపీ నేత రవ్‌నీత్ సింగ్ బిట్టూ ప్రకటనను హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు తీవ్రంగా ఖండించారు. రాహుల్ గాంధీపై బీజేపీ తమ చోటా నాయకులచే అనుచిత వ్యాఖ్యలు చేయిస్తోందని ఆరోపించారు. సుఖ్వీందర్ బుధవారం సిమ్లాలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పంజాబ్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా ఉండగా రవ్‌నీత్ సింగ్ రాహుల్ గాంధీని పొగుడుతూ పాటలు పాడేవారని గుర్తుచేశారు. ఎంపీ కాకుండానే ఇప్పుడు ఆయన బీజేపీ ప్రభుత్వంలో మంత్రి కాగానే రాజ్యసభ సభ్యత్వం కోసం బీజేపీ దృష్టిని ఆకర్షించేందుకు జాతీయ నేతపై విమర్శలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి నేతలను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అదుపులో పెట్టాలని హితవు పలికారు. ఉత్తరాదిలో కొన్ని రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది కాషాయ పార్టీ రాజకీయ ఎత్తుగడలో భాగమేనని దుయ్యబట్టారు. కాగా, కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ చేసిన వ్యాఖ్యలపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు భగ్గుమన్నారు. కేంద్ర మంత్రి ఇంటి ఎదుట యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం ఆందోళన చేపట్టారు. మంత్రి ఇంటి ముట్టడికి ప్రయత్నించిన కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ నేతలు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశాయి. బీజేపీ నేతలు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. కాగా, రాహుల్ గాంధీ భారతీయుడు కాదని, ఆయన తన జీవితకాలంలో అధిక సమయం విదేశాల్లోనే గడుపుతారని కేంద్ర మంత్రి రవనీత్ సింగ్ బిట్టూ అన్నారు. విదేశీ పర్యటనల్లో భారత్ గురించి తప్పుగా మాట్లాడతారని, ఆయనకు దేశం పట్ల ప్రేమ లేదని దుయ్యబట్టారు.




## అనిల్ అంబానీ కంపెనీ షేర్లకు రెక్కలు..

**రూ. లక్ష షేరుకు ఏకంగా రూ. 27 లక్షలు!**

**రిలయన్స్ పవర్‌కు సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ నుంచి 500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టు**

**నాలుగున్నరేళ్ల క్రితం షేర్ ధర రూ. రూ.1.13 మాత్రమే**

**అప్పర్ సర్క్యూట్‌ను తాకిన షేర్ ధర**

రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సోదరుడు అనిల్ అంబానీ జాక్‌పాట్ కొట్టారు. ఆయన కంపెనీ రిలయన్స్ పవర్ కు అతిపెద్ద ఆర్డర్ వచ్చింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఈ–రివర్స్ ఆక్షన్ ద్వారా 500 మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టు లభించినట్టు రిలయన్స్ పవర్ ప్రకటించింది. ఆ ప్రకటన ఇలా వచ్చిందో లేదో.. రిలయన్స్ పవర్ షేర్లు పైకి ఎగబాకాయి. సోమవారం రిలయన్స్ పవర్ షేర్లు అప్పర్ సర్క్యూట్‌ను తాకాయి. ఆ రోజు రిలయన్స్ పవర్ షేర్ రూ. 30.30 వద్ద ప్రారంభమైంది. ఆర్డర్ అందుకున్న తర్వాత 31.32 రూపాయలకు చేరుకుంది. మంగళవారం కూడా ఇదే జోరు కొనసాగింది. మార్కెట్ ప్రారంభమైన వెంటనే 31.51 రూపాయలకు చేరుకుంది. ఈ దెబ్బతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా లక్షాధికారులుగా మారిపోయారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కంపెనీ షేర్లు గత నాలుగున్నర సంవత్సరాలలో 2671 శాతం రాబడినిచ్చాయి. 27 మార్చి 2020న రిలయన్స్ పవర్ షేర్లు రూ. 1.13కి చేరాయి. నాలుగున్నరేళ్ల తర్వాత ఇప్పుడు ఒక్కో షేరు రూ. 31.32కి చేరింది.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT NO.51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN: 523225. Mobile: 9494177939, RNI: APTEL 16448. e-mail: rkreport9@gmail.com. E-Paper: shanmukhavelugu.com